ఆటపాటలతో విద్యనందించాలి

ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కేవీపల్లె : అంగన్‌వాడీ పిల్లలకు ఆట పాటలతో విద్యనందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి అన్నారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఇస్తున్న ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

3 నుంచి 8 ఏళ్ల లోపు పిల్లల మెదడు అభివృద్ధి చెందడానికి మంచి విద్యనందించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న మెలకువలు అంగన్‌వాడీ పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. సీడీపీఓ రాజమ్మ, కోర్సు డైరెకటర్, ఎంఈవో రెడ్డి బాషా, హెచ్‌ఎం వై.వి. రమణ, రిసోర్స్‌పర్సన్లు రాజు, సుదర్శన్, హరికృష్ణ, సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, భారతి పాల్గొన్నారు.



కేవీపల్లె: శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన పీడీ రమాదేవి



పీలేరు: మాట్లాడుతున్న జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి సమీవుల్లా

జ్ఞానజ్యోతితో చిన్నారుల సమగ్రాభివృద్ధి

మదనపల్లె : ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్రాభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెళకువలను జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా అందిస్తారని, అభ్యసన నైపుణ్యాలు పెంపొందిస్తారన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పిల్లలకు నేర్పడమే కాకుండా, కమిటీల ద్వారా తల్లులకు తెలపాలని, అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను బలోపేతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కేఆర్‌పీ వై.రవీంద్రారెడ్డి, డీఆర్‌పీ కే.చంద్రకాంత, నరసింహులు, ఏ.రమణమ్మ, కే.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

పీలేరు : అంగన్‌వాడీ విద్యార్థులకు విద్యతోపాటు ఆత్మస్థైర్యాన్ని కూడా పెంపొందించాలని జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి సమీవుల్లా అన్నారు. గురువారం మూడో రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అక్షరాస్యతా, సంఖ్యాశాస్త్రం అభివృద్ధి చెందితే విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి చెందుతారన్నారు. హెచ్‌ఎం నటరాజన్, ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, సురేష్ బాబు, సూపర్‌వైజర్లు స్వరూప, అక్కయ్య, స్వర్ణ, ఉమా, సీఆర్పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

అర్హులకు గుర్తింపు కార్డులేవి ?



రేగడపల్లెలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : జిల్లాలో అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ రేగడపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయంతిబాబును పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అనంతరం రేగడపల్లెలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన రైతులకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. జిల్లాలో రైతు గుర్తింపు కార్డుల జారీలో చాలా మంది రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. డీకేటీ, ప్రభుత్వభూమి కలిగిన రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం బాధాకరమన్నారు. నెలాఖరులోగా రైతుగుర్తింపు కార్డుల జారీకి గడువు ముగియనుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలకు గుర్తింకార్డులకు లింకు పెట్టడం శోచనీయమన్నారు. అధికారులు చొరవచూపి రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉత్తుత్తి పథకమే అని విమర్శించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల,చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రెడ్డినరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రెడ్డెప్ప, నాయకులు అమరనాథరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి నియోజకవర్గ పదవులు

పీలేరు : వైఎస్సార్‌సీపీలో పలువురికి నియోజకవర్గ పదవులు లభించాయి. పార్టీలో పలు అనుబంధ పదవులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా షేక్ దావూద్, మహిళా విభాగం అధ్యక్షుడు తాటిపర్తి లక్ష్మీదేవి, రైతు విభాగం అధ్యక్షుడిగా పసల భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా సీళ్ల భాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కందూరు రాజన్న, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్ అహ్మద్, క్రిష్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా జూపల్లె రాజన్న, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా చుక్కబోతు లోకనాథ్ నియామకమయ్యారు. పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా కేశవరెడ్డి, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా మద్దిరాళ్ల మల్లికార్జున, వలంటీరు వింగ్ అధ్యక్షుడిగా కోళ్ల యర్రమరెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా తరిగొండ రెడ్డినరసింహారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కంభం దినేష్‌కుమార్‌రెడ్డి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా తెల్లజీర వెంకటసిద్ధులు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా ఎస్‌కె. షబ్బీర్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడిగా తీరుపల్లె అనిత, లీగల్‌సెల్ అధ్యక్షుడిగా చింతపర్తి అశోక్‌కుమార్‌రెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా అంగజాల గురుశేఖర్, సోషల్‌మీడియా వింగ్ అధ్యక్షుడిగా రవికుమార్‌రెడ్డి, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా పొత్తపు సతీష్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా లక్ష్మన్న, డాక్టర్ వింగ్ అధ్యక్షుడిగా వీరబల్లె రామ్మోహన్‌రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, బూత్ కమిటీస్ అధ్యక్షుడిగా గండ్రాల వెంకటకిషోర్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా బొగ్గల ఆనంద్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

గుర్రంకొండ : మండలంలోని అమిలేపల్లె గ్రామం ఎగువ అమిలేపల్లె గ్రామసమీపంలోని ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వేనెం 199లోని ప్రభుత్వస్థలాన్ని కొంతమంది ఆక్రమించుకొని చదును చేసుకొన్నారు. ఈవిషయమై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు గురువారం వీఆర్వో ఫక్రుద్దీన్ చర్యలు చేపట్టారు. సదరు స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణదారులు చదును చేసిన స్థలం ప్రభుత్వ స్థలంగా గుర్తించినట్లు వీఆర్వో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి స్థలంలో ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని వీఆర్వో హెచ్చరించారు.



ఎగువఅమిలేపల్లె గ్రామసమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఆలయానికి లక్షన్నర విరాళం

కురబలకోట : మండలంలోని తెట్టు గ్రామం మండ్యంవారిపల్లెలో నూతనంగా వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం రూ. ఒకటిన్నర లక్ష విరాళంగా అందజేశారు. తెట్టు గ్రామ సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి తదితరులు ఈ మొత్తాన్ని గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా తెట్టు ఆలయ మాజీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి, నాయకులు నారాయణ, అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

డీఎల్‌పీఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

మదనపల్లె: మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ)నాగరాజుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రాఘవేంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ...డీఎల్‌పీఓ నాగరాజు గతంలో డీపీఓగా పనిచేస్తూ ఎస్సీ సర్పంచ్‌లు, ప్రభుత్వ పంచాయతీ సెక్రటరీలు, కింది ఉద్యోగస్థులపై అనేక మార్లు వేధింపులకు పాల్పడ్డాడన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ అడ్డూ అదుపు లేకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డీఎల్‌పీఓ నాగరాజు, వారంలో మూడురోజుల మాత్రమే మదనపల్లెలో ఉంటూ, మిగిలిన మూడు రోజులు సొంత ఊరు మడకశిర నుంచి ఫోనులో ఆఫీసు వ్యవహారాలు చక్కబెడుతూ, ఇక్కడే ఉంటున్నట్లుపై అధికారులను మభ్యపెడుతున్నారన్నారు. మదనపల్లె పంచాయతీ డివిజన్‌లోని 11 మండలాల్లోని మేజర్ పంచాయతీలైన అంగళ్లు, కురబలకోట, పొన్నూటిపాళ్యం, సీటీఎం, పీటీఎం సెక్రటరీలు, సర్పంచ్‌లను వేధింపులకు గురిచేశారన్నారు. అవినీతి అధికారి అయిన డీఎల్‌పీఓపై శాఖాపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నిధులు రికవరీ చేయాలి

పీలేరు : దుర్వినియోగం అయిన పీలేరు గ్రామ పంచాయతీ నిధులు రికవరీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా పని చేస్తున్న హబీబ్‌బాషా, జీనత్‌షఫీ పంచాయతీ నిధులు సుమారు రూ. 1.40 కోట్లు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం పంచాయతీలో జీతాలు చెల్లించలేని స్థితికి తీసుకొచ్చారని తెలిపారు. నిధులు స్వాహా చేసిన సర్పంచ్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు నరసింహులు, సురేష్, ఆయా యశోద, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బండి.. మొండికేసింది!



బస్సు మొరాయించడంతో విద్యార్థుల నిరీక్షణ

పెద్దతిప్పసముద్రం : ఆర్టీసీ బస్సులు కండీషన్‌లో లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ మొరాయిస్తాయో తెలియని దుస్థితి నెలకొంది. గురువారం మండలంలోని వరికసువుపల్లి సమీపంలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు ఇంజన్ వేడెక్కి నిలిచిపోయింది. దీంతో దూర ప్రాంతాలకు వివిధ పనుల మీద వెళ్లే ప్రజలు, ప్రధానంగా ఉదయం వేళ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆర్టీసీ డిపో యాజమాన్యం స్పందించి ప్రధానంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నడిచే బస్సులు కండీషన్‌లో ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు

కలకడ : మండలంలోని కలకడ, ఎనుగొండపాళ్యం పంచాయతీలలో శుక్రవారం నిర్వహించనున్న గొర్రెల సహకార సంఘం ఎన్నికలలో గొర్రెల కాపరులు పాల్గొని విజయవంతం చేయాలని కలకడ పశువైద్యాధికారి డాక్టర్ తేజకల్యాణ్ కోరారు. కలకడ రెవిన్యూ గ్రామం సంఘానికి జరగనున్న ఎన్నికలకు కేవీపల్లె మండలం గ్యారంపల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, ఎనుగొండపాళ్యం రెవెన్యూ గ్రామం సంఘానికి డాక్టర్ తేజకళ్యాణ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎనుగొండపాళ్యం పంచాయతీకి దిగువపాళ్యం పంచాయతీ కార్యాలయంలో, కలకడ రెవెన్యూగ్రామానికి దిగువపాళ్యం గ్రామంలో ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. గొర్రెల కాపరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పీలేరురూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె సమీపంలో వెలసిన శ్రీ మద్దిగుండాల మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం నగిరిపల్లెలో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నూతన ఛైర్మన్ జ్యోతాల మురళి మాట్లాడుతూ ఈ నెల 27న ఉత్సవానికి ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

నిమ్మనపల్లె : క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర అంశాలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని కొండయ్య గారిపల్లెలో టీబీ మాసోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, దగ్గినప్పుడు గళ్ల పడటం, గళ్లలో రక్తం పడటం, రోజు సాయంత్రం జ్వరం రావడం, గస, ఆయాసం, నీరసం, ఆకలి లేక పోవుట, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి,సమీపంలోని ఆశాకార్యకర్త, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవేంద్ర, ఏఎన్‌ఎమ్ చెన్నమ్మ, ఆశా కార్యకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ఖాజాజావిద్

మదనపల్లె సిటీ : స్థానిక సొసైటీకాలనీలోని లయన్స్‌క్లబ్‌లో గురువారం వైద్య శిబిరం జరిగింది. బెంగుళూరుకు చెందిన ఆల్టోస్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఖాజాజావిద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షురాలు డాక్టర్ నివేదిత, ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ భాస్కర్‌నాయుడు, ఏడీసీ గౌతమ్‌రెడ్డి, ఆడిటర్ కెఎస్ఎస్ ప్రసాద్, లయన్ భాస్కరాచారి, మహేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ



కార్మికులకు సామగ్రి అందజేస్తున్న ఎంపీడీఓ

కురబలకోట : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ముఖ్యమైనదని కురబలకోట ఎంపీడీఓ గంగయ్య, గ్రామ సర్పంచ్ సుక్కా సుజాత అన్నారు. గురువారం వారు కార్మికులకు పంచాయతీ కార్యాలయంలో యూనిఫాం, సబ్బులు, ఆయిల్, సబ్బులు, టవల్, చెప్పలు తదితర వాటితో పాటు పారిశుద్ధ్య పరికరాలు పంపిణీ చేశారు. రానున్న ఉగాది నుంచి వీరికి రూ. వెయ్యి చొప్పున జీతాలు పెంచుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు స్టీఫన్ మనోహర్, కార్యదర్శి శేషగిరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామసముద్రం : రామసముద్రం మండలంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మానేవారిపల్లి పంచాయతీ నాగనపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. దీనిపై ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేయగా, దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4010 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మారెమ్మ ఆలయంలో విగ్రహప్రతిష్ట



విగ్రహాలను ప్రతిష్టిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ : స్థానిక దిగువకమ్మపల్లెలోని మారెమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహం, పోతరాజు విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె : స్థానిక టీ.ఎన్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి,ఉపాధి కల్పన, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ముత్తూట్‌ఫైనాన్స్,మెడ్‌ప్లస్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు అర్హులన్నారు. బయోడేటా,విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, ఫొటోలతో అభ్యర్థులు 9.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9618655759 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు అద్దాలు పంపిణీ

రామసముద్రం : రామసముద్రం జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు గురువారం ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన రాష్ట్రీయ బాలల సురక్ష యోజన పథకం కింద ఉచితంగా అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి సకాలంలో వైద్యపరీక్షలు చేసి అవసరమైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్.లీల, ఎంపీడీఓ భానుప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల భైరవుడికి అభిషేకం

పెద్దతిప్పసముద్రం : శ్రీ కృష్ణదేవరాయుల కాలంలో నిర్మించిన స్థానిక శివాలయంలో కాల భైరవుడి ప్రతిమను సేవకులు పట్టాభిరామయ్య గురువారం అభిషేకం నిర్వహించారు. కాలభైరవ అష్టమి సందర్భంగా నిర్వహించినీ అభిషేకాన్ని ఉపవాస దీక్షతో నిష్ఠతో పూజలు జరిపామని ఆయన పేర్కొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ, పిట్టావాండ్లపల్లి గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో గ్రామ సమీపంలో స్థానికుడైన షేక్ మహమ్మద్ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

సోషల్ నెట్‌వర్క్‌పై అవగాహన

పీలేరు : స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో లింక్‌డ్ ఇన్ సోషల్ నెట్‌వర్క్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నైకు చెందిన ఫేస్ ప్రెప్ కంపెనీ ట్రైనర్ హరినారాయణ్ మాట్లాడుతూ లింక్‌డ్ ఇన్ పైన ప్రీమియం అకౌంట్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ఎలా నేర్చుకోవాలి, జాబ్ కెరీర్‌కు లింక్‌డ్ ఇన్ ఎలా దోహదపడుతుందనే అంశాలపై ఈ ప్రోగ్రాం ద్వారా తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ సి. విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.